# కాంగ్రెస్, బీజేపీలతో ప్రమాదం

- నమ్మితే నిండా మునుగుతరు
- వాళ్లు ఏం చేయరు.. ఉన్నవి తీసేస్తరు
- సీఎం కేసీఆర్‌తోనే మనకు భరోసా
- జగిత్యాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశా
- మెడికల్ కాలేజీని మంజూరు చేయించా
- జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్
- జిల్లా కేంద్రంలోని 28, 40 వార్డుల్లో ప్రచారం



జగిత్యాల: అవ్వా బాగున్నావా అంటు పలుకరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల, నవంబర్ 2: ‘ కాంగ్రెస్, బీజేపీలతో రాష్ట్రానికి చాలా ప్రమాదం. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది, దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే ఆ పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. వాళ్లకు ఉనికి లేదని ఈ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసి గెలిచేందుకు ఏవేవో హామీలు, గ్యారంటీలు ఇస్తున్నాయి. వాళ్లను నమ్మితే నిండా మునుగుడే. వాళ్లు ఏం చేయరు. ఉన్నవి తీసేస్తరు. ఆగం చేస్తరు. వాళ్ల పాలన మనకు కొత్తనా.. ఇదివరకు చూడలేదా..? ఒకసారి ఆలోచించాలని’ జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్‌తోనే మనకు భరోసా అని, బీఆర్ఎస్‌కే ఓటేయాలని కోరారు. ‘నియోజకవర్గ ప్రజలందరూ నా కుటుంబ సభ్యులేనని, మీ కష్టాలు, సమస్యలు తెలిసిన వ్యక్తినని మరొకసారి దీవిస్తే, ఎల్లవేళలా మీ వెంటే ఉంటూ ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని’ చెప్పారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని 28, 40 వార్డుల్లో తన సతీమణి రాధికతో కలిసి వేర్వేరుగా ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ తనను మొదటిసారి నమ్మి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదని, ప్రజా సమస్యలన్నీ పరిష్కరించానని, జగిత్యాలను అభివృద్ధిచేసినట్లు చెప్పారు. సీఎం కేసీఆర్‌కు విన్నవించి మెడికల్ కాలేజీ మంజూరు చేయించానని, జిల్లా కేంద్రంలో రూ.500 కోట్లతో నిర్మించుకుంటున్నామని చెప్పారు. మెడికల్ కాలేజీతో పేదలకు అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయన్నారు. జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో ఒకప్పుడు ఎక్స్‌రే సదుపాయం కూడా లేదని, కానీ ఇప్పుడు రూ.2 కోట్లతో సిటీ స్కాన్ ఏర్పాటు చేయించినట్లు వివరించారు. ఒకప్పుడు దవాఖానలో 15 మంది వైద్యులు ఉంటే నేడు 150 మందికి పెంచుకున్నామని, పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ఇంకా కిడ్నీ బాధితులకు డయాసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ వార్డుల్లో 73 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద సాయం చేశామని, బీడీ కార్మికులకు జీవనభృతి అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని ఉద్ఘాటించారు. అసహాయులు, వృద్ధులకు ఆసరా పింఛన్ కింద ప్రస్తుతం రూ.2వేల పింఛన్ అందిస్తున్నామని, ఎన్నికల తర్వాత దశలవారీగా రూ.5వేలకు పెంచుతామని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రూ.వెయ్యికి మించి ఇవ్వడం లేదని, అక్కడ ఇవ్వనోళ్లు ఇక్కడ ఇస్తరా..? ఆలోచించాలని సూచించారు. ఈ వార్డులో 75 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరయ్యాయని, రూ.80 లక్షలతో వార్డులో అన్ని రకాల వసతులను కల్పించామన్నారు. జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువును బాగు చేసుకున్నామని, రూ.2కోట్లతో మోడ్రన్ దోభీఘాట్ నిర్మించుకుంటున్నామని, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించామని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ సర్కారేనని, మూడోసారి సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఇక్కడ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, కౌన్సిలర్లు పద్మావతి పవన్, శివ కేసరి బాబు, తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలలో ప్రచారంలో మహిళలతో ఎమ్మెల్యే సతీమణి రాధిక



కోరుట్ల: కోరుట్లలో యువకుడికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# కోరుట్లలో కారు హవా

- దూసుకెళ్తున్న బీఆర్ఎస్
- జనంలోనే అభ్యర్థి శ్రేణులు
- జోరుగా చేరికలు
- కోరుట్లలో పార్టీలోకి 17వ వార్డు యువకులు
- ఆహ్వానించిన డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, నవంబర్ 2: అభివృద్ధి, సంక్షేమ పథకాలతో జోష్‌మీదున్న బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకెళ్తున్నది. కోరుట్ల నియోజకవర్గంలో కారు హవా నడుస్తున్నది. అందరికంటే ముందుగానే ప్రచారంలోకి దిగిన పార్టీ శ్రేణులు నిత్యం జనంతోమమేకమవుతుండగా, గులాబీ జోరు చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు, యువకులు బీఆర్ఎస్‌లో చేరిపోతున్నారు. గురువారం కోరుట్ల పట్టణంలోని 17వ వార్డుకు చెందిన యువకులు సుమారు 100 మంది బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి సంజయ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇక్కడ రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ చీటి వెంకట్రావు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఫహీమ్, కౌన్సిల ర్లు సజ్జు, జిందం లక్ష్మీనారాయణ, నాయకులు బాబా, రహీమ్, సనావోద్దీన్, అర్బాజ్ పాల్గొన్నారు.

## కోరుట్లలో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



కోరుట్ల: కోరుట్లలో సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

మెట్‌పల్లి, నవంబర్ 2 : ఈ నెల 3న కోరుట్లలో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్న నేపథ్యంలో గురువారం రాత్రి మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఏర్పాట్లను పరిశీలించారు. కోరుట్ల పట్టణ శివారు, మెట్‌పల్లి మండలం చౌలమద్ది శివారు నడుమ పెద్దగుండు సమీపంలో సభ కోసం ఎంపిక చేసిన దాదాపు 12 ఎకరాల స్థలంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. సీఎం సభా వేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాలు, ప్రజలు వచ్చిపోయే మార్గాలతో పాటు సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో మంత్రి సమాలోచనలు జరిపారు. ఇక్కడ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి



చందుర్తి: మాట్లాడుతున్న వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

- నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తా
- దళితుల ఆత్మీయ సమ్మేళనంలో వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు
- మా మద్దతు చల్మెడకే.. అంటూ దళితుల తీర్మానం

చందుర్తి, నవంబర్ 2: తనకు ఒక్క అవకాశం ఇవ్వండి.. వేములవాడ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తా.. అని వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో దళితుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయగా, చల్మెడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళితుల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం బృహత్తర పథకాలను అమలు చేసిందని, వారి ఆర్థికాభివృద్ధికి మరెన్నో కార్యక్రమాలను చేపట్టనుందని పేర్కొన్నారు. ఒకప్పుడు దళితులు వెనుకబడి ఉన్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ స్వరాష్ట్రంలో దళితబంధును అమలుచేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. దళితులకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు. దళితులు ఆత్మగౌరవంతో ఉండాలని ఉద్దేశంతో సీఎం కేసీఆర్ సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టారని, అలాగే 125అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పారని గుర్తుచేశారు. దళితబంధు. దళిత విద్యార్థుల విదేశీ విద్య కోసం రూ.25లక్షల సాయం అందిస్తున్నట్లు వివరిం చారు. విద్యార్థుల నాణ్యమైన విద్య కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి, సకల సౌకర్యాలతో విద్యనందిస్తున్నట్లు చెప్పారు. కాగా, మం డల కేంద్రంలో దళిత భవనం ఏర్పాటు చేయాల ని దళితులు కోరగా, అధికారంలోనకి రాగానే నిర్మిస్తామని ఆయన హామీఇచ్చారు. అనంతరం సుమారు 50మంది దళిత సంఘం సభ్యులు తమ మద్దతు చల్మెడకే అంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో అంబేద్కర్ డివిజన్ సంఘ అధ్యక్షుడు దమ్మ ఆనంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్, కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, పార్టీ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్ల య్య, మాజీ సర్పంచ్ సంటి బాబురావు, ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము రమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ గుడిసె రమేశ్, బేడబుడగజంగాల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మాదాసు ప్రసాద్, నగరపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చందుర్తి: మహిళలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న చల్మెడ కూతురు నిహారిక